

# తప్పిపోయిన కుమార్తె

లూకా15:11-32

వినోదిని

"వాళ్లు బేపనోళ్లంటివి గదమ్మా, మనల్ని రానిత్తారా?"

"నిన్నేమోగాని... నన్ను రానిస్తారు," అద్దంలో చూసుకుంటూ పాపటి తీసుకుంటున్న సువార్తవాణి చిన్నగా నవ్వుకుంటూ చెప్పింది.

మెత్తటి పసిపాదాలే అయినా దెబ్బ కాస్త గట్టిగానే తగిలింది పాలదాసుకి- గుండెల మీద కాబట్టి! కొంచెం తమాయించుకున్నాడు.

నిజమే, పగలు వఢ్రంగం పని, రాత్రి రెండో ఆట ఇడిసి పెట్టేదాకా రిక్షా వేసే తనకి సరైన గుడ్డలు కూడా లెవ్వు. కాళ్లెప్పుడూ మట్టిగొట్టుకపొయ్యుంటయ్- పుట్టిన కాడ్నుంచి చెప్పులన్న మాటే యెరగడాయె... కానీ కూతురు మాత్రం, తన బిడ్డంటే యెవురూ నమ్మరు. అంత సక్కన్ది...

"నిన్నేనమ్మా- మనల్నంటే... మనం తక్కువోళ్లం కదా, అందుకనంటన్నా."

"నాన్నా, వాళ్లేం అలాంటివాళ్లు కాదు. కులం, మతం అలాంటివేమీ లెవ్వు. మనుషులంతా ఒక్కటేనని మా ఫ్రెండు వాళ్ల నాన్న చాలా పుస్తకాలు రాశాడు. నేనింతక ముందు రాజమండ్రిలో చదూకునేటపుడు చాలాసార్లు వాళ్లింటికి కూడా వెళ్లాను. మా ఫ్రెండు నన్ను వంటగదిలోకి కూడా తీసుకెళ్లింది. ఇల్లంతా తిరిగాను."

"అట్టయితే ఇంకేమ్మా, జాగర్తగా పోయిరా. యేవే, పలకవేందే, నీయమ్మ యాడున్నావే, యిట్రా... నేను టేసన్కిపోయి పిల్ల నెక్కిచ్చొత్తాగానీ దేవసాయ మొత్తే కూకోమని సెప్పు," అని అక్కడున్న సూట్కేసుని అమాంతం భుజం మీదకెత్తుకొని, "పదమ్మా," అన్నాడు.

"అబ్బా ఏంటి నాన్నా అది...? ముందా సూట్కేస్ దించు. నువ్వెందుకు స్టేషన్కి అనవసరంగా, వేరే రిక్షా పిలు, నే వెళతాను."

"కాదమ్మా, ఇంత బరువేస్కుని బండేడెక్కుతావ్? నేనొత్తాలేమా!"

"వద్దన్నా కదా... నీక్కూడా ఏదో పనుందిగా, దేవసహాయం మామయ్య కూడా వస్తాడంటున్నావ్."

ఇంక కూతురు తనని స్టేషనుదాకా రానివ్వదని అర్థమైపోయింది పాలదాసుకి. వేరే రిక్షా పిలవడానికి పోయాడు.

స్టీలుబాక్సుకి మూతపెట్టి దాన్ని పైట చెంగుతో తుడుచుకుంటూ వచ్చింది కృపమ్మ. "కోడిగుడ్డు కూరమ్మా! యియ్యాల బేత్తవారం కదాని మోంసం తెచ్చినా! యేం లాబం? తినకపోతుంటివి," బాక్సు పాలిథిన్ కవర్లో బెట్టి కూతురి చేతికందించింది. హేండ్ బేగ్లో పెట్టుకుంది సువార్తవాణి.

"ఈమధ్య పడడం లేదమ్మా, లేకపోతే తిననా యేంటి?"

పొయ్యి మీద సట్టిలోంచి ఉడుకుడుకు మునుసుని గిన్నెలో కేసుకొని రోటికెదురుగా సతికిలబడుతున్న జక్కరయ్య-

"ఇరవయ్యేళ్లపైన తిన్నావ్, పడకపోవడమేంది? సోకు గాకపోతే. నీ సావాసగత్తెలడిగితే తిననని చెప్పుకోవడం కోసరం మానేశావ్గానీ ఇష్టం లేకేంగాదు," అన్నాడు. సువార్తవాణి తర్వాతవాడు జక్కరయ్య. అచ్చం బైబిల్లో జకరయ్యలాగా పొట్టిగా ఉంటాడని ఆ పేరు పెట్టారు.

పొగలు గక్కుతున్న మోచెయ్యంత మునుసుని అరచేతిలో ఇరికించుకొని దబదబా రోటికేసి గుద్దడం,

తపక్కమని బయటపడిన మూలిగని నోట్లో వేసుకొని చప్పరించుకుంట తినడం... అక్కవైపు ఒకసారి చూసి, ''ఇదివరికి ఆదివారం రాకతలికే తగులుకునేదానివి, 'అమ్మా కార్జంతే, అమ్మా నెరుడుతే, మునుసు లేకుండా రాబాక, అమ్మా గోంగూర బెట్టి వండవే,' అని కూర వుడక్కతలికే పొయ్యి మీద ముక్కలన్నీ దేవుకొని తినే దానివి. పెద్ద సదువులు సదువుతున్నావని మాను కున్నావ్. అయినా ఇప్పటికీ నాలిక లాగుతానే వుంట దిలే, నాకు తెలీదనుకుంటున్నావా?'' ఏడిపిస్తున్నట్లుగా అన్నాడు.

''అవున్రా, నీ బొడ్డు గిన్నెలోకి తక్కువవుద్దని తినడం మానేశాలే,'' ఆ మాటలో కొంచెం కోపం వున్నా, ఆ విషయం మీద తమ్ముడు మాట్లాడటమే అయిష్టం గా, అసహనంగా ఉంది సువార్తవాణికి.

''వాడి మాటలకేమొచ్చెలేగానీ, నువ్వు పోగానే ఉత్తరం రాయమ్మా,'' చిన్నపిల్లకి చెప్పినట్లు బతిమలా డుతూ చెప్పింది కృపమ్మ. అట్లా చెబుతున్నప్పుడు కూతురి వీపు మీద అరిచెయ్యి పెట్టాలనిపించింది. అరి చేతి పగుళ్లలో, గోళ్లలో బూడిదతో మసిగిన్నెలు తోమి నపుడు ఏర్పడిన మురికిచారలు గీతలై అడ్డం వచ్చాయి.

''రాస్తాలేగానీ, ఏంటా చీర, అంతపైకి దోపావ్. ముందు దించు. ఎన్నిసార్లు చెప్పానే నీకు, పొద్దున్నే లేవ గానే తల దువ్వుకోమని...'' ఇంకా సువార్తవాణి పూర్తి చేయకముందే-

''పవడ్రాసుకోమని, యిస్త్రీ బట్టలేసుకోమని, గ్యాసుపొయ్యి మీద అన్నమొండమని, టీవీ చూడమని...'' పకపకా నవ్వుకుంటా ఎగతాళిగా అక్క గొంతుని అనుకరిస్తూ అన్నాడు జక్కరయ్య.

అప్పటికి మునుసులో ఉన్న మూలిగంతా వచ్చే సింది. రోటంచు మీద మునుసుని అడ్డంగా పడుకో బెట్టాడు. ఒక చివర మునుసు గొట్టాన్ని మూసేస్తూ ఎముక మూలిగ కల్సిపోయిన ఒక రకమైన మట్టిరంగు నల్లభాగం మీద పచ్చడిబండతో చిన్నదే అయినా గట్టి దెబ్బ వేశాడు. అది బద్దలుబద్దలుగా విచ్చిపోయింది. ఒక్కొక్క ముక్కని చెరుకుముక్క పెట్టుకున్నట్లు నోట్లో పెట్టుకుని నమలడం, పొడుం పొడుం అయిన పిప్పిని గాలితో సహా బయటికి ఊదడం చేస్తున్నాడు. పక్కనే కూర్చున్న కుక్కకి మజ్జమజ్జలో ఒక్కొక్క బద్ద విసురు తున్నాడు. తమ్ముడ్నిలా చూస్తే ఇంకా కోపం ఎక్కువై, ''ఛీ పోరా, నీతో నాకేంటి?'' కోపంగా తమ్ముడి వైపు చూసి అప్పుడే పాలదాసు తెచ్చిన రిక్షా ఎక్కి కూర్చుంది సువార్తవాణి.

ఇంచుమించు మోకాళ్లు కన్పించేట్టు దోపుకున్న చీర అంచుని బొడ్లోంచి ఊడలాగుతూ, ప్రేమగా నవ్వుతూ, ''జాగర్తగా పోయిరామ్మా,'' మళ్లీ పసిపిల్లకి చెప్పినట్లే గారాబంగా చెప్పింది కృపమ్మ.

సువార్తవాణిది ఆ ఇంట్లో మొదట్నుంచీ ఒక ప్రత్యేకస్థానమే. తెలివైందని, చదువుకుంటుందని, చక్కన్దని. గుంటూరు పక్కనున్న పల్లెటూర్లో పుట్టినా ఆమె ఎంతదాకా చదివితే అంతదాకా చదివిద్దామను కున్నారు కృపమ్మ, పాలదాసులు. కూతురు తమకంటే సుఖంగా, గౌరవంగా బతకాలని అనుకున్నారు. చదువు మాత్రమే మనిషి విలువను పెంచుతుందని వాళ్ల నమ్మకం.

తెలుగు సాహిత్యం మీద ఇష్టమూ, గోదావరి మీద అంతులేని ప్రేమ కారణం కాకుండా కేవలం ఆమె కొచ్చిన మార్కుల వల్ల సువార్తవాణి రాజమండ్రిలో ఎమ్మే చదివింది. సాహిత్యాన్ని, గోదావరిని ప్రేమించి నంతగానే తన క్లాస్‌మేట్ గాయత్రిని కూడా ప్రేమిం చింది. కథలు, నవలలు రాస్తాడని గాయత్రి వాళ్ల నాన్న పిరాట్ల సుబ్రహ్మణ్యంని ప్రేమించింది. నిండుగా ఆగస్టు నెల గోదావరిలా ఉంటుందని వాళ్లమ్మ కామేశ్వరమ్మనీ ప్రేమించింది.

హాస్టల్లో ఉండి చదువుకుంటున్న సువార్తవాణిని వాళ్లింటికి రమ్మని మొదటిసారి గాయత్రి ఆహ్వానించి నపుడు ఒకరకమైన ఉద్విగ్నతకు లోనైంది సువార్తవాణి. తానింతవరకు ఒక్కసారి కూడా బ్రాహ్మలింటికి వెళ్ల లేదు. చెప్పాలంటే తనకలాంటి స్నేహితులెవరూ లేరు. ఎలిమెంటరీ స్కూల్లో చదివేటపుడు యానాదులిళ్లకీ, హైస్కూలు నుండి డిగ్రీ వరకు క్రిస్టియన్ల ఇళ్లకే వెళ్లింది. ఎప్పుడైనా వేరే హిందూ కులస్థుల ఇళ్లకు కూడా వెళ్లింది. ఇప్పుడు మొదటిసారి బ్రాహ్మలింటికి వెళుతోంది.

సిటీబస్ దిగింతర్వాత గాయత్రి వాళ్లింటికి కొంచెం దూరం నడవాలి. మజ్జలో గుడి. గుడి దగ్గర ఆగి సువార్తవాణి మొహంలోకి చూసి, ''ఇప్పుడు నిన్ను ఇంటికెలా తీసుకెళ్లాలే, మొహం బోసిగా ఉంది, ఆగు...'' అంటూ హేండ్‌బేగ్‌లోంచి రేనాల్డ్స్ రెడ్‌పెన్ తీసింది.

''కదలకు,'' అంటూ సువార్తవాణి మొహాన్ని పట్టుకొని నుదుటి మీద బొట్టులా దిద్దింది. అది సరిగ్గా రాయని పెన్ను.

''ఇది సరిగ్గా పడటం లేదు. ఇలారా...'' సువార్త వాణి చెయ్యి పట్టుకొని గుడిలోకి తీసుకెళ్లింది. ఆంజ నేయస్వామి గుడి.

"పీరియడ్స్‌లోగాని లెవ్వుగా," అనుమానంగా అడిగింది గాయత్రి.

"లేను," అస్పష్టంగా అంది సువార్తవాణి.

అక్కడున్న తిలకంతో సువార్తవాణికి బొట్టు పెట్టింది గాయత్రి. అయోమయంగా ఉంది సువార్త వాణికి. మొదటిసారి బొట్టు పెట్టుకోవడం. సరదాగా కూడా ఎప్పుడూ బొట్టు పెట్టుకుని యెరగదు తను...

"అబ్బ ఎంతందంగా ఉన్నావో చూడు, రూపమే మారిపోయింది. ఆడదన్నాక బొట్టు అందమే! నిండుగా ఉంది మొహం. కళకళలాడుతున్నావనుకో."

సువార్తవాణిని చాలా మెచ్చుకుంది కామేశ్వ రమ్మ. "చక్కని పిల్ల. వర్ణం ఏదైతేనేం మంచి ఉచ్చారణ. ఎంత స్పష్టంగా మాట్లాడుతుందో, నేర్చుకోవే గాయత్రీ," అంది.

ఆరోజు సువార్తవాణి ఆ ఇంట్లో ఉన్నంతసేపు వాళ్ల ఇల్లూ, అమ్మానాన్నా, తమ్ముడూ అంతా మసక బారిపోయారు. ఆ తర్వాత కూడా రెండు మూడుసార్లు వాళ్లింటికెళ్లింది సువార్తవాణి.

వాళ్లింట్లో వాళ్లు మాట్లాడే ప్రతి పదం చివర్లోనో, మధ్యలోనో ఇంగ్లీషు అక్షరం 'H' చేర్చి మాట్లాడిన ట్లుంది. సువార్తవాణి ఆ ఇంట్లో ఉన్నంతసేపు తనకు తెలియకుండానే అట్లా మాట్లాడేది.

అట్లా, ఆ తర్వాత కూడా తనకి 'తెలియకుండానే' చాలా పనులు చేసేది సువార్తవాణి. పేరు చెప్పాల్సి వచ్చి నపుడు 'వాణి' అని చెప్పడం, రాయాల్సి వచ్చినపుడు సువార్తని 'S'గా మార్చి వాణి రాయడం, యూనివర్సిటీ లో ఒకరిద్దరు లెక్చరర్లు గొంతు చించుకొని పాడే పద్యా లకి క్లాసులో అందరూ పారిపోయినా, తను మాత్రం అలాగే కూర్చొని వినడం... భరించలేని నొప్పితో కణ తలు కొట్టుకుంటున్నా సరే... సిలబస్‌లో లేకపోయినా లైబ్రరీలో బూజు పట్టిపోయిన సంస్కృత గ్రంథాలని హాస్టల్‌కి మోసుకుంటూ తెచ్చుకోవడం... ఊర్లో తరచూ జరిగే అవధాన సభల్లో చివరిదాకా కూర్చోవడంలాంటివి.

మెస్‌లోకో, క్యాంటీన్‌లోకో వెళ్లినప్పుడల్లా- ఎంగిలిని, ఎంగిలి మెతుకులని, ఎంగిలి చెయ్యి అని, ఎంగిలి ప్లేటు అని మాట్లాడటం, వాటిపట్ల మిగతా వాళ్ల కంటే అత్యంత స్పృహగా ఉండటం, టిఫిన్‌బాక్సు ల్లోంచి అందరూ చేతులతో వడ్డించుకుంటున్నా తను మాత్రం గరిట కోసమో, స్పూన్ కోసమో ఆరాటపడి పోవడం... వాళ్లింట్లో ఏం తింటారు? ఏం వండు కుంటారు? లాంటి విషయాలు దాచిపెట్టి... వాళ్ల క్లాస్ మేట్లు లంచ్ బాక్సుల్లో తెచ్చుకునే గుత్తివంకాయ కూర, సాంబారు, కొబ్బరి శనగపప్పులాంటి వంటలే అదే పద్ధతిలో వాళ్లమ్మ కూడా చేస్తుందని చెప్పడం లాంటివి కూడా! వీటితో పాటు చర్చి ఎగ్గొట్టడం, కాశీతాడు చేతికి కట్టుకోవడం, గాయత్రి వాళ్లింటి కెళ్లినప్పుడల్లా బొట్టు పెట్టుకోవడంలాంటివి వీటిలో ముఖ్యమైనవి.

గాయత్రి వాళ్ల అక్క బిడ్డ బాలసారె ఫంక్షన్‌కి ఇంకోసారి వాళ్లింటికెళ్లే ఛాన్స్ దొరికింది సువార్తవాణికి. వాళ్లింటికెళ్లడమంటే- గొడ్డుతోలుతో చేసిన పాతబడి, తెగి, ఈడ్చుకొస్తున్న మొరటు చెప్పుల్ని పెంటకుప్పలో పడేసి, అకులలములతో చేసిన నాజూకైన కొత్త చెప్పు ల్లోకి- పాదాలతో పాటు తాను కూడా అత్యంత సౌకర్య వంతంగా దూరిపోయి నంత హాయిగా ఉంటుంది సువార్తవాణికి.

వారం క్రితమే చెప్పింది గాయత్రి నిప్పుని కడిగే నియమనిష్టలతో ఉండే వాళ్ల బామ్మగానీ, అంతే నియమనిష్టలతో పాటు పెళ్లి కెదిగిన ఆడపిల్లలందరికీ ఉచితంగా జాతకాలు చూసే వాళ్ల బాచి మామగానీ ఈ ఫంక్షన్‌కి రాకపోతే సువార్తవాణిని తీసుకెళతానంది.

నిజమే! వాళ్ల మేనమామొచ్చి జన్మనక్షత్రం, పుట్టిన ఘడియలు, రాశి... మట్టీ... మశానం... అడిగితే తానేం చెబుతుంది? దీనివలన ఆయనకి తన కులం తెలిస్తే గాయత్రికి తిట్లు తప్పవు. అందుకే సువార్తవాణి వాళ్లు ఆ ఫంక్షన్‌కి రాకూడదని కోరుకున్నట్లే జరిగింది.

ఫంక్షన్లో సువార్తవాణిని చూసి చాలామంది సంబంధాలు మాట్లాడబోయారు. సువార్తవాణి కులం తెల్సుకొని ఆశ్చర్యపోయారు. 'హరిజనుల్లో కూడా ఇలాంటి ఆడపిల్లలు ఉన్నారా,' అని. ఆ సందర్భాలలో కులం చెప్పాల్సి వచ్చినపుడు గాయత్రి, చెప్పేశాక సువార్తవాణి చాలా ఇబ్బందిపడ్డారు. గాయత్రి అయితే అది పలకకూడని తప్పుడు పదంలాగా రహస్యంగా, గుసగుసగా చెబుతుంటే, సువార్తవాణి దొరికిపోయిన దొంగలాగా మొహంపెట్టి గిల్టీగా వాళ్లవైపు చూసేది. ఒకరిద్దరయితే ఓదార్పుగా, 'కమ్మోరో, రెడ్లో అనుకున్నాం గానీ హరిజనపిల్లలా లేదులే,' అన్నారు. ఆ మాటతో ఓదార్పు లభించడంతో పాటు చాలా చాలా గర్వంగా కూడా అన్పించింది.

తన వాళ్లు, తన ఇల్లు, తన వాడ, చాలా చిన్న చిన్నవిగా కన్పిస్తుండగా పెద్దపెద్ద అంగలతో వాటినన్నిం టినీ దాటుకుంటూ ఇవతలికొచ్చేసింది సువార్తవాణి.

ఆ పేరంటంలో గాయత్రి ఇంటికొచ్చిన అందరి ఆడవాళ్ల పాదాల దగ్గర కూర్చుని పసుపు రాస్తోంది. సువార్తవాణి గబగబా వెళ్లి తన పాదాల్ని ముందుకు

చాపింది. 'నేను రాయకూడదే నీకు, హరిజన్ల పాదాలని బ్రాహ్మలు ముట్టగూడదు,' అని చెప్పింది. చివుక్కున పాదాలు వెనక్కి తీసుకుంది సువార్తవాణి. పాచిపోయి పుళ్లు పడిన పాదాలకి, పగిలిపోయి చిట్లిపోయిన ముళ్లులాంటి పాదాలకి, చర్మం రాలిపోతున్న ఎండిన పాదాలకి, గోళ్లలో మట్టి పేరుకుపోయి, నల్లగా మురికి పట్టిన మోటుపాదాలకి కూడా తన మెత్తని అరచేతులతో పసుపు రాసింది గాయత్రి. ఆ పేరంటంలో తను స్వేచ్ఛగా తిరగగలుగుతున్నందుకే సంతృప్తిగా ఉంది సువార్తవాణికి. పసుపు రాసిన అందరి పాదాల ముందు తన పాదాలు వెలవెలపోవడం నచ్చలేదు. గిన్నెలోంచి కొంచెం పసుపు తీసుకొని పాదాలకు రాసుకుంది.

ఈ గర్వాలు, సంతోషాలు ఏ సెలవలకో ఇంటికొచ్చినపుడు, విసుగ్గా , కోపంగా, అయిష్టాలుగా మారిపోయేవి. తన అమ్మానాన్నలతో గాయత్రి తల్లిదండ్రుల పోలికలు లేకపోవడం చాలా విసుగనిపించేది. ఇంట్లో వాళ్ల భాష, అలవాట్లు, పద్ధతి, వ్యవహారం ఏదీ నచ్చేది కాదు. కొన్నిసార్లు చిరాగ్గా, అసహ్యంగా కూడా అనిపించేది. వాళ్లని విసుక్కుంటూ, కసురుకుంటూ మాట్లాడేది. ప్రతి విషయాన్ని వేలెత్తి చూపించేది. మెల్లగా ఆమె ప్రవర్తనకి వాళ్లు అలవాటుపడ్డారు.

యమ్మే అయ్యాక గాయత్రి పెళ్లి చేసుకుని స్టేట్స్ వెళ్లిపోయింది. పిరాట్ల సుబ్రహ్మణ్యం రిటైరవ్వడంతో వాళ్లు హైదరాబాద్‌కి మారి సొంతింట్లో స్థిరపడిపోయారు. పార్ట్‌టైం లెక్చరర్‌గా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్టడీ సెంటర్లో చేస్తూ, రీసెర్చ్ చేస్తూ సెలవులకి ఇంటికొచ్చిన సువార్తవాణి స్పాట్ వాల్యూయేషన్‌కి హైదరాబాద్ రావాలంటూ వచ్చిన ఉత్తరంతో పాటు హైదరాబాద్ బయలుదేరింది.

*

'ఈ వర్షానికస్సలు మెదడు లేదు- అక్కడంటే కురిసింది పల్లెటూళ్లో. ఇక్కడెందుకూ- ఇంత పెద్ద సిటీలో,' అనుకుంటూ సికింద్రాబాదులో రైలు దిగింది సువార్తవాణి. ఆటో డ్రైవర్‌కి సుబ్రహ్మణ్యం ఇంటి అడ్రస్ చెప్పి ఎక్కి కూర్చుంది. ఆటో కదిలింది.

ఇప్పుడు గాయత్రి వాళ్లింట్లో ఎవరుంటారు? వాళ్ల అమ్మానాన్న, హైదరాబాదులోనే ఉద్యోగం చేసే భర్తతో సహా వాళ్లక్క... సగం గదులు వాడుకుంటూ, అద్దె కడుతూ.

ఆటో ట్యాంకుబండు మీద తడుచుకుంటూ పోతోంది. తారు నదీపాయలా నల్లగా మెరుస్తున్న రోడ్డు. తల కొంచెం వంచిపెట్టి ఆటోలోంచి ఎడమ పక్కనున్న విగ్రహాలని చూస్తోంది సువార్తవాణి. జాషువా! నిలువెల్లా అవమానాల వర్షంలో తడిసినా, చెక్కుచెదరని ఆత్మ గౌరవపు మెరుపుతో ఠీవీగా కన్పించాడు. చప్పున ఏదో గుర్తుకొచ్చింది. మెడలో వున్న గొలుసుని తీసి దానికి వేలాడుతున్న లాకెట్‌ని ఊడదీసింది. తిరిగి గొలుసు మెడలో వేసుకుంది. గుప్పిట తెరిచి లాకెట్ వైపు చూస్తూ, 'సారీ జీసస్' నవ్వుతూ చెప్పి ఆ క్రాస్‌ని హేండ్ బాగ్‌లో ఒక మూల పడేసింది. అదే హేండ్‌బాగ్‌లోంచి అరచెయ్యంత బొట్టుబిళ్లల పేకెట్ తీసి ఒక బిళ్లని నుదుటి మీద అంటించుకుంది. హమ్మయ్య ఏదో రిలీఫ్. ఆటో టాంక్‌బండ్ చివరనున్న అంబేద్కర్‌ని దాటుకుంటూ వెళ్లింది.

అడ్రస్ సులభంగానే దొరికింది. కొత్తగా కట్టిన ఇల్లు. పొద్దున్నే అగరొత్తుల వాసన...

"వన్ వీక్ నాన్నగారూ- ఈవేళ్టి నుండి ట్వంటీ సెకండ్ వరకు."

"అక్కడే ఉండటానికి ఫెసిలిటీ ఏం కల్పించరా," సూటిగా అడిగాడు సుబ్రహ్మణ్యం.

"లేదు నాన్నగారూ, నలుగురైదుగురు కల్సి ఓ లాడ్జిలో రూం తీసుకొని ఉంటారు. లేడీస్ కూడా అలాగేనట. నేను మాత్రం ఇటొచ్చేశాను," నవ్వుతూ చెప్పి తాగేసిన కాఫీ గ్లాసు తీసుకొని కిచెన్‌లోకి వెళ్లిబోయింది.

"ఆగమ్మాయ్, ఈవేళ పూజ చేశాం. మడీ అదీ ఉంది," అని ఆ గ్లాసుని హాల్లోనే ఓ మూల పెట్టించింది కామేశ్వరమ్మ.

గాయత్రితో తనకున్న స్నేహాన్ని బంధంగా మలుచుకునే ప్రయత్నంలో ఉండేది సువార్తవాణి. ఆ ఇంట్లోవాళ్లతో తనకీ సంబంధం ఉన్నట్లు ఆ ఇంట్లో అన్ని విషయాలూ గాయత్రితో పాటు తనకీ చెందుతాయన్నట్లు స్వేచ్ఛగా, ధీమాగా ప్రవర్తించేది. వాళ్లక్కని, బావని, 'అక్కా బావగార'నే కాదు, అమ్మానాన్నల్ని కూడా 'అమ్మా నాన్నగారూ,' అని పిలవడం, వాళ్లింటిని 'మనిల్లు' అనడం లాంటివి చేసేది. తన వాళ్ల గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా అమ్మా, నాన్న, తమ్ముడు అని చెప్పేది.

కానీ గాయత్రి మాత్రం మా అమ్మ, మా నాన్నగారుతో పాటు, మీ అమ్మ, మీ నాన్నగారు, మీ తమ్ముడనే మాట్లాడేది.

ఇప్పుడు కూడా తను ఆ ఇంట్లో ఓ వారం రోజులుండడానికి వీలైనంత అవకాశముందనే బలమైన భావన, నమ్మకం- ఆ మాత్రం సంపాదించుకోవాలనే ఒక ఆశ ఆమెని ఆ ఇంట్లో దించాయి. బహుశా తాను

తిరిగి వెళ్లేటపుడు ఒక చీర కూడా పెడతారేమో అని ఒక మెరుపు ఆశ ఆమెకి ఓ మూల లేకుండా పోలేదు.

కామేశ్వరమ్మతో, 'అందరూ బాగున్నారా అమ్మా?' అంటూ మొదలుపెట్టి, వాళ్ల చుట్టాలందర్నీ పేరుపేరునా అడిగింది, పిల్లలతో సహా! వాళ్లల్లో చాలా ఎక్కువమందిని తానెప్పుడూ చూడలేదు, వినడం తప్ప. కానీ కామేశ్వరమ్మ మాత్రం ఎవరి క్షేమ సమాచారాలూ అడగలేదు. అసలు వాళ్ల పేర్లుగానీ, ఆ కుటుంబంలో ఎంతమంది ఉన్నారు అనిగానీ ఆమెకు ఖచ్చితంగా తెలీదు. ఆమెకే కాదు... ఆ కుటుంబంలో ఎవరికీ తెలీదు గాయత్రితో సహా...

*

రోజూ బస్సులు, ఆటోలు మారుకుంటూ జూబ్లీ హిల్స్ యూనివర్సిటీ దాకా వెళ్లిరావడం! తనొచ్చేసరికే చీకటి పడిపోయేది, బుక్‌షాపులు, లైబ్రరీలు తిరగడం వలన. అప్పటికే వాళ్లంతా అన్నాలు తిని తనకోసం ఒక ప్లేటులో అన్నం, కూరలు తీసి తనగదిలో పెట్టేవాళ్లు.

తనకి ప్రత్యేకంగా ఒక చిన్న గదిచ్చారు. ఆ గది నిండా పుస్తకాలు, ఒక మంచం. సుబ్రహ్మణ్యం, కామేశ్వరమ్మ ఉండే ముందు పోర్షన్నీ, గాయత్రి వాళ్ల అక్కాబావ ఉండే వెనక పోర్షన్నీ కలిపే గదది. తనకి పుస్తకాల గదిచ్చినందుకు చాలా సంతోషం వేసింది సువార్తవాణికి. ఒక బీరువాలో సగం పైన పుస్తకాలు సుబ్రహ్మణ్యం రాసినవే. అణచివేయబడ్డ కులాలు, అణగారిన వర్గాలు, పేదలు, బీదలు, ఒంటరి స్త్రీలు, వేశ్యలు- ఇవీ ఆయన వస్తువులు.

అందం, చదువు, సంస్కారం కల్గి ఉన్నత కులాల్లో పుట్టిన యువకులు ఈ వర్గాల్లో ఉన్న స్త్రీలను పెళ్లి చేసుకోవడం చాలా కథల్లోనూ, నాటకాల్లోనూ ఉన్న వస్తువు. రోజూ అవి చదివి నిద్రపోయేది సువార్త వాణి. వాటి గురించి ఎప్పుడన్నా సుబ్రహ్మణ్యంతో డిస్కస్ చేయాలన్పించేది. ఎన్నిసార్లు అతన్ని పలకరించినా ముక్తసరిగా మాట్లాడేవాడు. భార్యని విసుక్కుంటూ, ఫోన్‌లో ఎవర్నెవర్నో గట్టిగట్టిగా కేకలేస్తూ ఉండేవాడు. సువార్తవాణితో మొదటిరోజు మాట్లాడిన ఒక వాక్యం తప్ప ఇంకేమీ మాట్లాడలేదు.

మూడోరోజు నుండి సువార్తవాణికి ఒక భయం పట్టుకుంది. పీరియడ్స్ డౌటు దగ్గరకొచ్చింది. అప్పట్నుంచి అది ఏ రోజైనా రావొచ్చు. ఏ క్షణమైనా రావొచ్చు.

'వస్తే ఏం చెయ్యాలి? వీళ్లతో చెప్పాలా? అక్కతోనా? అమ్మతోనా? చెబితే... ఆ ఇంట్లో బాత్రూం తలుపు పక్కన ఓ మూలనున్న కొంచెం స్థలంలో... మొన్న గాయత్రి వాళ్ల అక్క కూర్చున్నట్టు తానూ కూర్చోవాలా? అక్కడే నిద్రపోవాలా? తినే ప్లేటూ చెంబూ బాత్రూంలో కడిగి ఓ మూలన పెట్టాలా? ఇంట్లో ఆ ఇద్దరు మగాళ్లకి కూడా తెల్సిపోతుందేమో కదా... ఛీఛీ... అట్లా వద్దు!! పోనీ చెప్పకపోతే...? రహస్యంగా దాచిపెడితే...? స్నానం చేశాక, వాడిన నేప్‌కిన్ ఏం చెయ్యాలి? ఇడిచిన బట్టల్తోపాటు చుట్టి సూట్‌కేస్‌లో పెట్టేయాలా? ఏదైనా కవర్లో చుట్టుకొని హేండ్‌బాగ్‌లో పెట్టుకొని బయటికొచ్చినపుడు పడెయ్యాలా? ఏం చెయ్యాలి...? అయినా అలా దాచిపెట్టడం వాళ్లను మోసం చేసినట్లవుతుందికదా? వాళ్ల సంప్రదాయాల్ని అవమానించినట్లవుతుంది కదా! అదే తనింట్లో అయితే ఇలాంటి ఇబ్బందులేవీ ఉండవు...' ఇలా ఆలోచిస్తుండగానే ఆరోజు వచ్చేసింది. 'హమ్మయ్య... ఈ ఒక్కరోజు గడిస్తే చాలు, రాకుండా... రేపెల్లిపోవచ్చు,' ఊపిరి పీల్చుకుంది.

ఆరోరోజు సాయంత్రం ఆరు గంటలకే బస్ దిగి ఇంటివైపు నడుస్తున్న సువార్తవాణితో, "ఏంటీ రోజు తొందరగా వస్తున్నారు?" అంటూ పక్కన స్కూటరాపాడు గాయత్రీవాళ్ల బావగారు- ఎక్కమన్నట్టు సైగ చేసి.

"ఈరోజు పనులేం పెట్టుకోలేదండి..." నవ్వుతూ చెప్పి మొహమాటపడుతూ స్కూటరెక్కి కూర్చుంది.

"పట్టుకొని కూర్చోండి. రోడ్లు బాగోవు..." అంటూ స్కూటర్ని సాధ్యమయినంత వరకు మంచి రోడ్డు నొదిలి గోతుల్లోంచి పోనిస్తూ మజ్జమజ్జలో సడన్ బ్రేకులేస్తున్నాడు.

ఏంటో ఈ బావగారు, పొద్దున్నే చనువుగా తలుపు తోసుకొనొచ్చి గుడ్మార్నింగ్ చెబుతాడు. తను వాళ్ల బాత్రూంలోనే స్నానం చేస్తది కాబట్టి రెండు మూడుసార్లు తలుపు కొట్టి 'అయ్యిందా,' అని అడుగుతాడు. పాప నెత్తుకొని ఉంటే తన గుండెలకి చేతులానిస్తూ పాపని తీసుకుంటాడు. రాత్రి పదకొండు దాటాక, అందరూ నిద్రపొయ్యాక గదిలోకొచ్చి 'టీవీ చూద్దురు రండీ,' అంటాడు- మళ్లీ రోజూ పూజ, మడి- 'సంప్రదాయమంటే ప్రాణం పెడతారు మా బావగారు,' అంటుంది గాయత్రి...?

"ఏంటండీ ఏం మాట్లాడరు? సినిమాలు చూస్తారా?" అడిగాడు.

"ఎప్పుడన్నా."

"ఇంగ్లీషు."

"అప్పుడప్పుడు."

“ఆ సినిమా చూశారా?” ఒక వాల్‌పోస్టర్ చూపించాడు. అశ్లీలమైన భంగిమలో ఒకబ్బాయి ఒకమ్మాయిని పట్టుకొని ఉన్న పోస్టరది. వాళ్లకి సరిగా బట్టలు కూడా లెవ్వు... జుగుప్స... అతనలా అడిగినందుకు కొంచెం అవమానంగా, మరింత బాధగా అన్పించింది.

“ఏంటీ? చూళ్లేదా...?” తలపక్కకి తిప్పి నవ్వుతూ అడిగేడు.

“లేదు.”

“భలేవాళ్లేనే, లైఫ్ అన్నాక ఎంజాయ్ చెయ్యాలండి. పైగా మీరు క్రిస్టియన్ అయ్యుండీ... ట్రెడిషనల్‌గా పెరిగిన అమ్మాయి కాదుగదా! మా ఆవిడ, గాయత్రీ... వీళ్లంటే ఒక కులం అనీ, సంప్రదాయమనీ, కట్టుబాటనీ, నీతనీ, జాతనీ, గోంగోరనీ, వంకాయనీ, ఇవన్నీ మోసుకొని తిరిగినోళ్లు. ఆర్థోడాక్సు, వాళ్లనెవ్వరూ మార్చలేరు. మీరేంటండీ, ఈ బరువులేమీ లేనోళ్లు- హాయిగా లైఫ్ ఎంజాయ్ చెయ్యకా! ఎందుకండీ అలా లేని మడి కట్టుకొని, పసుపు రాసుకొని కూర్చోటం- అసలు మీరేం అనుకోకపోతే ఓ మాట చెప్పనా?...” స్కూటర్ని ఓ హోటల్ ముందు ఆపుతూ అన్నాడు.

“... పదండి కాఫీ తాగుతూ మాట్లాడదాం.”

ఇబ్బందిగా అతని వెనక హోటల్లోకి నడిచింది. కన్పించీ కన్పించకుండా క్రాఫులో కల్సిపోయిన పిలక. ముక్కుపైన చుక్కలా పెట్టిన చెరగని తిలకం. చేతికి కట్టిన రకరకాల దారాలు. కూల్‌డ్రింక్ తాగుతూ మళ్లీ మొదలుపెట్టాడు.

“ఈరోజుల్లో సైన్సు చాలా డెవలపైంది. దేనికీ భయపడాల్సిన పనిలేదు. నాకు చాలామంది క్రిస్టియన్ అమ్మాయిల్తో స్నేహముంది. స్నేహమంటే మీకు అర్థమయిందనుకుంటా...” కన్నుగొట్టి నవ్వాడు.

“నాకు వాళ్లల్లో చాలా అంశాలు నచ్చుతాయి. మోడ్రన్ డ్రెస్సులు వేసుకోవడం, అమ్మాయి-అబ్బాయి అని బేధం చూపించకుండా బండెక్కుతారు. సినిమా! షికార్! పార్క్! ఎక్కడికైనా... వ్యక్తి స్వేచ్ఛని చక్కగా ఉపయోగించుకుంటారు. ఏ సంకోచాలు లేకుండా పక్కనే కూర్చుంటారు. షేకాండ్లిస్తారు. పెళ్లీగిళ్లీ అని సెంటిమెంటు డైలాగులుండవ్. కిందా మీదా పడి ఎన్ని ముద్దులు పెట్టుకున్నా బొట్టు చెరిగిపోతుందన్న భయమే లేదు,” గట్టిగా నవ్వాడు.

గొంతు తడారిపోయింది సువార్తవాణికి. చిన్నప్పటి జామెంట్రీ బాక్స్‌లోని విభాగిని రెండు ముల్లనీ అడ్డంగా చీల్చి రెండు అరచేతుల మధ్య పెట్టి బయట నుండి రెండు చేతుల మీద ఒకేసారి బలంగా కసుక్కున గుద్దినట్లనిపించింది సువార్తవాణికి.

‘ఎంత చులకన- కులం మీద, మతం మీద... ఇంత లూజ్ మాటలెలా మాట్లాడుతున్నాడు. పొద్దున్నే లేచి పూజలు చేసి, ఇల్లంతా పసుపు నీళ్లు చల్లుతూ...’

“ఏంటలా చూస్తున్నారు- మీకు తెలీదేమో, సిటీలో ‘మీవాళ్ల’ అమ్మాయిలు అలాగే ఉంటారు. పల్లెటూర్లో మాత్రం తక్కువా? మీకు తెలియందేముంది, చాలామంది హరిజనవాడోళ్లని పెద్దింటి మగాళ్లు వాడుకుంటా ఉంటారు కదా! చెరుకుతోటల్లో, జొన్నచేలల్లో... ఆ థ్రిల్లే వేరు... అక్కడయితే కడుపూ కాలూ సమస్యలుంటాయ్. ఇక్కడలాంటివేమీ వుండవు. చెప్పానుగా సైన్సు చాలా డెవలపైందని...”

ఇందాకయిన గాయాల్లోంచి ఇప్పుడు రక్తం కారడం మొదలైంది సువార్తవాణికి. తక్కున లేచి నిల్చుంది. ఏమీ మాట్లాడకుండా బయటికి నడిచింది. ఆమె వెనకే అతనూ-

ఇంటికొచ్చి బాత్రూంలోకి వెళ్లి మొహం కడుక్కుంది. సరిపోయినట్లు లేదు. చన్నీళ్లతో తలస్నానం చేసింది. అతను మాట్లాడిన మాటలు- ముఖ్యంగా తన కులపు ఆడవాళ్ల గురించి అతడు చేసిన కామెంట్లు- తల్చుకుంటే పదునైన కత్తి శరీరం లోపలికంటా దిగి చీలుస్తున్నట్లుంది. అన్నం తినలేకపోయింది సువార్తవాణి. వెళ్లి తన గదిలో లైటు తీసేసి పడుకుంది. హైదరాబాద్ అవ్వడం వలన సెప్టెంబర్‌లోనే చలి చెలరేగింది. చలికి ఒక్క తలుపు కూడా సరిగ్గా పట్టడంలేదు. పైగా దొంగల భయం. అందుకే ఆరోజు ఉదయం నుంచి ఆ ఇంట్లో వడ్రంగం పని జరుగుతోంది. తలుపులన్నింటికీ దువ్వాడ పట్టడం- కొత్త బోల్టులు, గడియలు పెట్టడం, మొత్తం పనయ్యేసరికి తొమ్మిదయింది. అన్నింటినీ ఒకసారి చెక్ చేసుకొని పనివాళ్లకి డబ్బులిచ్చి పంపించేసింది కామేశ్వరమ్మ.

పదిగంటలకి సుబ్రహ్మణ్యం భార్యకి ఫోన్ చేసి చెప్పాడు. గంటా గంటన్నరలో వస్తానని. సువార్తవాణికి నిద్రపట్టడంలేదు. ఏమీ చదవాలనిపించడంలేదు. హోటల్లో అతనన్న ప్రతి మాటా తనన్నట్లే అన్పిస్తోంది.

వాళ్లన్నా, వాళ్ల ఆచారాలన్నా, అలవాట్లన్నా తనకెంతో గౌరవం. వాళ్లకి మాత్రం తన కులపోళ్లంటే చులకన, తక్కువ అభిప్రాయం, అలుసు, ఎగతాళి... ఆ అలవాట్లలో, ప్రవర్తనలో గౌరవం ఉండదనుకొని- తను వాళ్లకిలాగా భాషా, వేషం, కట్టూ మార్చింది.

చివరికి బొట్టు కూడా... తను వాళ్లలో ఒకతిగా కల్సిపోవాలని ఎంతగా ఆరాటపడింది? అయినా- వాళ్లకి మాత్రం ఓ హరిజన పిల్లే. ఓ క్రిస్టియన్ గాళ్!

ఎన్నిసార్లు తన నిజస్థితి చుట్టూ అవమానాలూ, హేళనలూ ఎదుర్కొంది?... దారి మధ్యలో తన ప్రమేయం లేకుండానే నుదుటి మీదకు బొట్టు రావడం, అంతమందిలో తనని స్నేహితురాలిలా కాకుండా... హరిజన అని వేరుచేసి పాదాలకి పసుపు రాయక పోవడం... అసలు వీళ్ల ఆచారాల్లోనూ, భాషలోనూ గౌరవముందని తనెందుకనుకుందో?? తనున్న సంస్కృతికే ఓ గౌరవాన్ని ఎందుకివ్వలేకపోయింది...??

స్కూటర్ శబ్దం... సుబ్రహ్మణ్యం వచ్చినట్లున్నాడు. కామేశ్వరమ్మ వెళ్లి తలుపు తీసింది. సువార్తవాణి టైం చూసింది. పన్నెండున్నర. ఒక అయిదు నిమిషాల తర్వాతేమో ఉన్నట్టుండి గట్టిగా అరవడం మొదలు పెట్టాడు సుబ్రహ్మణ్యం.

"ఛండాలపు లంజా! పొద్దుట్నుంచీ ఏం చేస్తున్నావే? ఆ వడ్రంగోడి ఎదురుగ్గా కూర్చొని ఒళ్లు చూపిస్తున్నావే... ముసల్లంజా! ఏదే...? ఆ వీధి వాకిలికి గడేదే? ఆ జాతి తక్కువ నా కొడుకు దగ్గరగానీ పడుకున్నావేమే! వాడు గడి పెట్టకుండా పోతుంటే చూస్తూ ఊరుకున్నావ్, మాల్లంజా! మాదిగబుద్ధులూ, మాదిగ చేష్టలూనూ, కిరస్తానీ ముండా! ఆ బుద్ధులు వంటబట్టిచ్చుకున్నావ్ గదే, ఆ వడ్రంగోణ్ణి తగులుకోరాదూ?... నిన్నా మాలా మాదిగ నా కొడుకులు... మాల్లంజా... కిరస్తానీ లంజా," అని భయంకరంగా ఇష్టమొచ్చినట్లు తిడతానే ఉన్నాడు. ఆ నోటికి గడి లేకుండా పోయింది.

సువార్తవాణి షాకయింది. అతనలా తిట్టడం విని... సువార్తవాణికి అంత పచ్చిబూతులు కొత్తేం కాదు. తనిళ్లలో కూడా తిట్లున్నాయ్. అయితే అవి జీవితంలో భాగంగా, భాషలో ఒదిగిపోయాయ్. ప్రేమలో, స్నేహంలో చనువుగా తిట్లు వాడుకుంటారు. కోపంలో కూడా వాడతారు. అయితే ప్రేమబంధం కొనసాగాల్సిన ఇద్దరు వ్యక్తుల మధ్య- ఇంత జుగుప్సాకరంగా ఇంత అసహ్యంగా, ఇంత ద్వేషంగా, ఇంత అవమానకరంగా మాత్రం కాదు.

ఆయన తిట్టే తిట్లకి- వడ్రంగి లోపల గడియ పెట్టడం మర్చిపోవడానికి సంబంధం ఏమిటి? అసలు సుబ్రహ్మణ్యం నోటికి అట్లాంటి భాష కూడా వస్తుందని ఊహించలేదు సువార్తవాణి. పుస్తకాల బీరువా వంక చూసింది. అందులో ఆదర్శాల హీరోలు మాట్లాడే మాటలకి, సుబ్రహ్మణ్యం తిట్టే తిట్లకి పొంతన కుదరడంలేదు.

భార్య నొక్కదాన్నేనా తిట్టింది? కాదే? తనని కూడా? తన కులాన్ని తిట్టాడు, మతాన్ని తిట్లాడు. తిట్ల మధ్యకి తన ఆడవాళ్లని లాగాడు. తన మగవాళ్లనీ లాగాడు. విభాగినో, కత్తో ఏదో తెలీటంలా, శరీరమో, మనసో ఎక్కడంటే అక్కడ... అడ్డంగా, నిలువుగా... ఎట్లాబడితే అట్లా తనని పీలికలు పీలికలుగా చీలుస్తున్నట్లనిపించింది సువార్తవాణికి. కనిపించని పదునైన గాయాల తాలూకు బాధ లోపల్లోపల సలపడం మొదలైంది. ఇల్లు గుర్తొచ్చింది. ఆ తట్టుకోలేని బాధకి గుండె కమిలిపోతోంది. తెల్లార్లూ ఆ పచ్చిపుళ్ల సలపరంతో నిద్ర పోలేకపోయింది సువార్తవాణి.

అమ్మా, తమ్ముడు, నాన్న, ఇల్లు, వాడ- చుట్టూ కమ్ముకున్న మసక చీకటి కరిగిపోయి, స్పష్టమైన రూపంతో తనకోసమే ఎదురుచూస్తున్నారు.

తెల్లారింది. స్నానం చేసి వచ్చింది సువార్తవాణి. ఈరోజు తను వెళ్లిపోయేరోజు. అన్నీ సర్దుకుంది. చివరిగా పర్సు వోపెన్ చేసి జీసస్ లాకెట్ తీసి మెడలో వేసుకుంది. నుదుటిని ఫెయిర్‌గా అలా వదిలేసింది. బొట్టుబిళ్లల పాకెట్ తీసి డస్ట్‌బిన్‌లో పడేసింది. సూట్‌కేస్ తీసుకొని బయటకొచ్చింది. అందరూ హాల్లో ఉన్నారు.

తాను వెళ్లిపోతున్నట్టు చెప్పింది. చివర్రోజు కాబట్టి యూనివర్సిటీ నుండి అట్నుంచటే వెళ్లిపోతున్నట్టు చెప్పింది.

"వస్తానమ్మా," సమాధానం కోసం ఎదురు చూడకుండా చెప్పులేసుకుంటున్న సువార్తవాణితో, "బొట్టు మర్చిపోయినట్లున్నావమ్మాయ్," చెప్పింది కామేశ్వరమ్మ. "లేదమ్మా! మర్చిపోలేదు. నేను కిరస్తానీ ఆడపిల్లని, దళితపిల్లని," మాట్లాడటానికి ఇంకేమీ లేదన్నట్టు చిన్నగా నవ్వి బయటకు నడిచింది సువార్తవాణి.

*సాహిత్యనేత్రం, జులై-సెప్టెంబర్, అక్టోబర్-డిసెంబర్ 2008*

